క్లుప్తంగా

నేడు దుర్గాదేవి అవతారంలో అమ్మవారు

రాయదుర్గం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని ఆదివారం దుర్గాదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. దీనిలో భాగంగా గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు, గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి, దుర్గాదేవీ అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. శివసాయిక్షేత్రంలో మండపపూజ, సామూహిక చండీపారాయణం, చండీహోమం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఉచిత వైద్య శిబిరం


ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన నిర్వాహకులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఏఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం ఫౌండేషన్ అధ్యక్షుడు రేవంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోటరాక్ట్ క్లబ్, కేర్ ఆసుపత్రి, మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి. బాలాజీ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా.. వైద్య, కంటి పరీక్షలు, జనరల్ చెకప్, ఫిజీషియన్ కన్సల్టేషన్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించి వైద్యులు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు జైపాల్, మోహన్‌గౌడ్, రాజు యాదవ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాద బ్రహ్మోత్సవంలో భాగంగా శనివారం కళాకారిణి యుక్తారెడ్డి శిష్య బృందంచే కూచిపూడి నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు యామిని, మీనాక్షి, మౌక్తిక, నమ్రత, హంసిని, గుణశ్రీక్షితలు అయిగిరినందిని, బ్రహ్మాంజలి, అష్టలక్ష్మి స్తోత్రం, ధీంధీం తిల్లాన, గోవిందా గోవిందా సంకీర్తనలను ఆలపించి అలరించారు. సమతామూర్తి శిల్పానికి సేవలందించిన డీ.ఎస్.వీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో ఆలిండియా సారీ మేళా, దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బెంగుళూరుకి చెందిన బెనాక నాట్య మందిర్ గురువు రేఖ దినేష్ శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శన, వైష్ణవి నాట్య సెంటర్ గురువు వైష్ణవి సాయినాథ్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో మైసూర్ జాతి, ముదారక, శృంగారపుర, అష్టలక్ష్మి, దుర్గే దుర్గే , కంజదళాయదాక్షి, వాళ్లచి తిల్లాన, పుష్పాంజలి, స్వాగతం కృష్ణ, అలరిపు, శారద కౌతం తదితర అంశాలను కళాకారులు గాయత్రి, అక్షర, రిధి, శృతి, లక్ష్మి, నారాయణ్, స్నేహాలు ప్రదర్శించారు.



కుంచించుకుపోతున్న రహదారులు



మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు, ఇన్‌సెట్‌లో ట్రాఫిక్ ఇలా..

- రోడ్లపై వాహనాల పార్కింగ్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పార్కింగ్‌పై దృష్టిసారించని అధికారులు

వ్యాపార సముదాయాలకు పార్కింగ్ వసతి లేకపోవడం వాహనదారులకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ట్రాఫిక్ కష్టాలతో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతోంది. దీనిపై అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా నెలకొల్పుతున్న నిర్మాణదారులతో కొంతమంది అధికారులు లాలూచీ పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగించడంతో పాటు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో పాదచారులు ఆయా రోడ్లపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మియాపూర్ : చందానగర్, మియాపూర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, జేపీఎన్‌నగర్, మయూరీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, మియాపూర్ బొల్లారం రోడ్డు, ఓల్డ్ మియాపూర్, ఇక్రిశాట్ కాలనీ, పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, జాతీయ రహదారి పక్కన సర్వీసు ఏరియాలలో వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా పార్క్ చేస్తున్నారు. దీనికి తోడు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఆయా కాలనీల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

- మియాపూర్, చందానగర్‌లలో రోడ్లన్నీ కుంచించుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు రహదారులతో పాటు అంతర్గత రోడ్లలో ఆక్రమణల కారణంగా స్థానికులకు అవస్థలు తప్పడం లేదని, దీనిపై స్థానికులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని వాపోతున్నారు.
- ఉదయం, సాయంత్రం సెలవు దినాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు రద్దీగా ఉంటున్నాయి. రోడ్లపై వాహనాల పార్కింగ్, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రోడ్ల పై వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో రోడ్లు కుంచించుపోవడం వల్ల ట్రాఫిక్‌తో వాహనదారులు సతమతమవుతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ..

కోట్లాది రూపాయాలు వెచ్చించి పాదాచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు కుంచించుకుపోతున్నాయి. ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద వివిధ వస్తువులను కొనుగోలు చేసేందుకు వచ్చిన వాహనదారులు రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో అంతర్గత రహదారులలో రాకపోకలు సాగించలేక గంటల తరబడి రోడ్ల పైనే వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

వాహనదారుల ఆగ్రహం..

జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎవరూ.. పట్టించుకోకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై కూడా వాహనాలు పార్కింగ్ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ప్రధానరోడ్లు, వాణిజ్య వ్యాపార సముదాయాల వద్ద రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగించకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి..

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అరికెపూడి శ్యామల దేవి కోరారు. శనివారం చందానగర్‌లోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, విద్యానగర్, ఫ్రెండ్స్ కాలనీ, శ్రీలక్ష్మి శుభం ఆర్కేడ్, సాయికీర్తి, ఎస్‌వీఎస్ అపార్ట్‌మెంట్స్, డాల్ఫిన్ దుర్గ కౌంటి, తదితర కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటికి తిరుగుతూ.. పార్టీ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళల పక్షపాతి అని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఒంటరి మహిళలకు పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్ వివిధ రకాల సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.9వేల కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు గుడ్ల ధనలక్ష్మి, వరలక్ష్మి, చంద్రిక ప్రసాద్, మాధవి, పృథ్వీ, రాధిక, ప్రణీత, భవాని, కుమార్, సునీత, మీనా, హరిత తదితరులు పాల్గొన్నారు.


చందానగర్ డివిజన్ ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి, కార్పొరేటర్

‘అవినీతికి బీఆర్ఎస్.. అభివృద్ధికి బీజేపీ’..


దూబేకాలనీలో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నేత రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా బీఆర్ఎస్ పార్టీ, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా బీజేపీ పార్టీ నిలుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్రలో భాగంగా లింగంపల్లి డివిజన్ దూబేకాలనీలో పాదయాత్ర చేస్తూ.. ఇంటింటికి వెళ్లి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి ప్రభుత్వం, పార్టీని ఇంటికి పంపించి, బీజేపీని అధికారంలోకి తీసుకరావాలని ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారన్నారు. దూబే కాలనీలో 2014కు ముందు చేసిన అభివృద్ధి తప్పా.. కొత్తగా బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక కాలనీకి చేసింది శూన్యమని విమర్శించారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు, మంజీరాపైపులైన్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసింది మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రోజూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు ఎల్లేష్, రమేష్, అనిల్‌కుమార్‌యాదవ్, చంద్రశేఖర్‌రావు, చెన్నయ్య, రెడ్డి ప్రసాద్, అఫ్సర్, అనిల్, గోపాలకృష్ణ, వెంకటస్వామి, జగదీష్, చంద్రమోహన్, బీరప్ప, శ్రీశైలం, భాస్కర్, నర్సింగ్‌యాదవ్, లక్ష్మి, అరుణ, సుశీల పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో శ్రమదానం


శ్రమదానంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

రాయదుర్గం: వీకెండ్స్‌లో విద్యార్థులంతా కలిసి శ్రమదానం, క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. హెచ్‌సీయూలో ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌సీయూ సెల్ ఆధ్వర్యంలో హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం కంప్యూటర్లు, పుస్తకాలతో కుస్తీలు పడే విద్యార్థులు వీకెండ్‌లో శనివారం ఉదయం పలుగుపార చేతపట్టడమే కాకుండా భారీ చెట్ల కొమ్మలను సైతం తొలగించి వాటిని డంపింగ్ యార్డుకు తరలించారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని ‘స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్’ ప్రాంగణంలో చెట్ల నుంచి వేరుపడిన కొమ్మలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. చెట్ల నుంచి గాలికి రాలి పడిపోయిన పొడి ఆకులు, ఇతర వ్యర్థాలను ఏరి వాటిని ట్రాక్టర్లతో డంపింగ్ యార్డుకు తరలించారు. ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌సీయూ కో– ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, వాలంటీర్లు, విద్యార్థులు అజయ్‌ప్రకాష్, వెంకటేష్, నితిన్, ముస్తఫా, రిషబ్‌శర్మ, యోగేంద్రప్రతాప్‌సింగ్, అనీస్ అహ్మద్, కుసుమ, మనీషా, దివ్య ధనేశన్, ప్రతాప్ తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్ల సందర్శన

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, కొండాపూర్ డివిజన్ల పరిధిలో ఓల్డ్ హఫీజ్‌పేట్, మదీనాగూడ, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ ప్రాంతాల్లోని పోలింగ్ సేషన్లను శనివారం శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్లలో కావాల్సిన కనీస వసతులపై కింది స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు


పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీ పార్టీలోకి చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన కాలనీ వీకర్ సెక్షన్, భవానీపురం వీకర్ సెక్షన్లలోని వివిధ పార్టీకి చెందిన నాయకులు శనివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర 105వ రోజు చందానగర్ డివిజన్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ.. బీజేపీ పార్టీ చేసిన అభివృద్ధిని ఆయన వివరించారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందించి అండగా నిలబడింది కేవలం మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, ఇంటి పట్టాలిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ పార్టీని ప్రజలంతా బలపర్చాలని ప్రజలను కోరామన్నారు. కాలనీవాసులు అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని హామీఇచ్చారు. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, సింధురెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, రమేష్, ఆదిత్య, శ్రీనివాస్, రాకేష్ తదితరులున్నారు.

దొంగలతో జాగ్రత్త !

- దొంగతనాలను అరికట్టేందుకు సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక చర్యలు


సైబరాబాద్ పోలీసులు ఆటోతో ప్రచారం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో దొంగతనాలను అరికట్టేందుకు పలు సూచనలను పోలీసులు సూచించడంతోపాటు వాటిని అందరూ పాటించాలని కోరారు. పండుగలు, సెలవుల్లో ఊరెళ్లేవారు ముందస్తు చర్యలు పాటించాలని సూచించారు. అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100 కు లేదా వాట్సప్ నెంబర్ 9490617444కు డయల్ చేసి చెప్పాలని వివరించారు.

- ఊరు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి
- సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళం అమర్చుకోవడం ఉత్తమం. మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- మీ వాహనాలను మీ ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయాలి. వీలైతే చక్రాలకు చైన్స్‌తో కూడా లాక్ వేయడం మంచిది.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలి. సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.
- మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తాచెదారం, న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి. వాటిని కూడా గమనించి దొంగతనాలకు పాల్పడతారనే విషయాన్ని గమనించాలి.
- మెయిన్‌డోర్‌కి తాళం కప్ప వేసినప్పటికీ అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి. బయటికి వెళ్లేటప్పుడు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసి ఉంచాలి.
- మీ ఇంటి దగ్గర మీకు నమ్మకమైన ఇరుగుపొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండాలని చెప్పండి.
- అల్మారా, కప్‌బోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్లకింద అల్మారాపైన్ డ్రెస్సింగ్ టేబుల్, కప్‌బోర్డులో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచాలి.
- బంగారు ఆభరణాలు వేసుకుని ఫంక్షన్లు, గుడికి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో మీరు బయటకు వెళ్లే విషయాన్ని ఇతరులకు చెప్పడం మంచిది కాదు. కాలనీలో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్ : లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సరితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారు జామున చందానగర్ గాంధీ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30) జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా.. మహారాష్ట్రకు చెందిన లారీ (ఎంహెచ్43బిపి4583) వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

‘హైలైఫ్’ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటీమణులు

మాదాపూర్ : మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనను నటి రాశిసింగ్, చాందిని బగ్వానాని, ప్రియచౌదరి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని, వివాహాది శుభకార్యాలకు కావాల్సిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయని తెలిపారు. ప్రత్యేక డిజైన్‌లతో కూడిన ఉత్పత్తులు, గృహాలంకరణ వస్తువులు నగరవాసులను ఆకట్టుకుంటాయన్నారు. పలువురు మోడల్స్ తదితరులున్నారు.

ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాచెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ రాగా ఆర్టీపీసీఆర్ టెస్టులు ఏడుగురికి నిర్వహించినట్లు నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు


బొటానికల్ గార్డెన్‌లో బతుకమ్మ వేడుకల్లో మహిళల సందడి

గచ్చిబౌలి/రాయదుర్గం : తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులలో మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని, భక్తిశ్రద్ధలతో రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజించిన అనంతరం ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. బొటానికల్ గార్డెన్, టెలికామ్‌నగర్‌లో మహిళలు బతుకమ్మ ఆడారు. వాకర్స్ అసోసియేషన్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


టెలికామ్‌నగర్‌లో బతుకమ్మ వేడుకలు

మహాలక్ష్మీ నమోస్తుతే

రాయదుర్గం: విజయదశమి సందర్భంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం అమ్మవారికి మహాలక్ష్మిదేవీ అవతారంలో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం వంటి పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తుల సందడి పెరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

- గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి మహాలక్ష్మిదేవీ అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సామూహికంగా కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య చండీపారాయణం, చండీహోమాన్ని చేపట్టారు.
- రాయదుర్గంలోని మండపం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి, రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి.


గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో సామూహిక పూజలు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ, హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో మహాలక్ష్మిగా రాజరాజేశ్వరీమాత


కొండాపూర్ డివిజన్ ఆలయంలో హోమం చేస్తున్న దృశ్యం